

మహదేవపూర్ ప్రధాన కూడలిలో 500 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల భారీ ర్యాలీ

## త్రివర్ణ శోభితం

**మహదేవపూర్‌లో 500 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం మహదేవపూర్‌లో 500 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి త్రివర్ణ పతాకాన్ని ప్రధాన రహదారుల మీదుగా ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది.

- మహదేవపూర్, ఆగస్టు 13



క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై సీపీఎం జిల్లా ప్రతినిధుల బృందంతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# ప్రజాభిప్రాయం మేరకే నిర్ణయం

- ‘కుడా’ విలీన గ్రామాల పరిధిపై జనగామ ఎమ్మెల్యే పల్లా
- ప్రజాప్రతినిధులు, పార్టీలు, వివిధ సంఘాలతో సమావేశం

జనగామ, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : మెజార్టీ ప్రజలు, వర్గాల అభిప్రాయాల మేరకే కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో గ్రామాలను విలీనం చేసే విషయమై నిర్ణయం తీసుకుంటామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. కుడా ప్రతిపాదించిన విలీన గ్రామాలు, వాటి పరిధి వంటి అంశాలపై ఆయన కసరత్తు ప్రారంభించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, ‘కుడా’ విలీన గ్రామాల ప్రజాప్రతినిధులు, పట్టణంలోని వివిధ సంఘాలు, వాణిజ్య సంస్థలు, చాంబర్, వర్తక సంఘాలు, డాక్టర్లు, కళాశాలల యాజమాన్యాలు, న్యాయవాదులు, సీపీఎం, సీపీఐ, బీజేపీ జిల్లా ప్రతినిధి బృందంతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. అర్బన్ అభివృద్ధిలో భాగంగా జనగామ మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ కుడా రూపొందించిన రూట్ మ్యాప్‌ను చూపించారు. అయితే వివిధ వర్గాల నుంచి వ్యక్తమైన భిన్నాభిప్రాయాలను క్రోడీకరించి ఏకాభిప్రాయం సాధించేందుకు వీలుగా మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. కుడా పరిధిలో గ్రామాలను విలీనం చేస్తే జరిగే లాభ, నష్టాలు, పన్నుల పెంపు, నిర్మాణాలకు అనుమతులు వంటి విషయాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. అలాగే జనగామ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (జుడా) ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదించాలన్న అభిప్రాయం వ్యక్తం కాగా, జనాభా వంటి నిబంధనల వల్ల అది ఇప్పట్లో సాధ్యం కాదని, తొలుత ‘కుడా’ పరిధిలోకి వెళ్లిన తర్వాత ప్రయత్నం చేయాలనే నిర్ణయానికి వచ్చారు.

కాగా, జనగామలో శుద్ధమైన మంచినీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని, పట్టణంలోని బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలని, హుస్నాబాద్–జనగామ రోడ్డుపై గానుగపహాడ్ వద్ద బ్రిడ్జి పనులు వేగంగా పూర్తి చేయాలని, వడ్లకొండ, చీటకోడు వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని, నియోజకవర్గంలో పాడి, కోళ్ల పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఇండస్ట్రీ కారిడార్ ఏర్పాటుకు కృషి చేయాలని ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాగే జనగామలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని, చంపక్ హిల్స్ గిరిజన వెల్ఫేర్ హాస్టల్‌లో గదుల నిర్మాణంతో పాటు సౌకర్యాలు కల్పించాలని, పీజీ కాలేజీకి కేటాయించిన స్థలంలో నిర్మాణ పనులు చేపట్టాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మందులు, డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన పల్లా అన్ని పక్షాల భాగస్వామ్యంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, సీనియర్ నాయకులు బొట్ల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాశ్, సుంచు విజేందర్, భూక్యా చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నిట్ ఇంజినీరింగ్‌కు 21వ ర్యాంక్

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 13 : కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ(ఎంవోఈ) విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌ఐఆర్‌ఎఫ్) 2024లో నిట్ వరంగల్ ఇంజినీరింగ్ కేటగిరీలో 21వ ర్యాంక్‌ను నిలుపుకుంది. ఓవరాల్ కేటగిరీలో 53వ ర్యాంక్‌ను పొందింది. నిట్ ఇంజినీరింగ్ ఓవరాల్ కేటగిరీ గత ఏడాది ర్యాంకులను నిలబెట్టుకుంది. వరంగల్ నిట్ మేనేజ్‌మెంట్ విభాగంలో మొదటిసారి పాల్గొని 100 ర్యాంక్‌ను పొందింది. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంక్‌ను వివరంగా విశ్లేషిస్తామని, ర్యాంక్‌ను మెరుగుపరచడానికి కృషి చేస్తామని తెలిపారు.

# సురేఖకు ఝలక్

- ఆమె సొంత జిల్లా వరంగల్‌కు గెస్ట్‌గా పొంగులేటికి ఛాన్స్
- మంత్రి సీతక్కకు మాత్రం సొంత జిల్లాలోనే..
- ఆగస్టు 15న ముఖ్య అతిథుల జాబితా తీరిది
- సర్కారు నిర్ణయంపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ

**హనుమకొండ జిల్లాకు అతిథిగా మంత్రి కొండా**

వరంగల్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో మరోసారి ప్రతికూల నిర్ణయం వచ్చింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా నామినేట్ చేసిన ముఖ్యుల(డిగ్నిటరీ) జాబితాలో ఉమ్మడి జిల్లాలోని మరో మంత్రి సీతక్కకు దక్కిన ప్రాధాన్యత కొండా సురేఖకు దక్కలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా సురేఖ, సీతక్క ఉన్నారు. ఆగస్టు 15న అన్ని జిల్లాల్లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యుల జాబితాను చీఫ్ సెక్రటరీ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ములుగు జిల్లా వేడుకలకు ముఖ్య అతిథిగా ఉన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హనుమకొండ జిల్లా వేడుకల్లో పాల్గొనేలా నామినేట్ చేశారు. కొండా సురేఖ ప్రస్తుతం వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ అసెంబ్లీ సెగ్మెంట్ పూర్తిగా వరంగల్ జిల్లాలోనే ఉన్నది. వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండా సురేఖకు ఆగస్టు 15 వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొనే అవకాశం సొంత జిల్లాలో కాకుండా పక్కన ఉన్న హనుమకొండ జిల్లాలో ఇచ్చారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రస్తుతం ములుగు జిల్లాకు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ అసెంబ్లీ సెగ్మెంట్ ములుగు, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో ఉన్నది. ఆగస్టు 15 ఉత్సవాలకు ములుగు జిల్లా ముఖ్య అతిథిగా మంత్రి సీతక్కకు సొంత జిల్లాలోనే రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. మరో మంత్రి కొండా సురేఖను పక్కన ఉన్న హనుమకొండ జిల్లాకు నామినేటెడ్ చేయడంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వరంగల్ జిల్లా వేడుకకు ముఖ్య అతిథిగా నిర్ణయించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వరంగల్ ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నారు. రాష్ట్రంలోని మంత్రుల్లో ఎవరూ ఇన్‌చార్జీగా ఉన్న జిల్లాల్లో ఆగస్టు 15 వేడుకలకు ముఖ్య అతిథిగా లేరు. మంత్రి కొండా సురేఖ సొంత అసెంబ్లీ సెగ్మెంట్, సొంత జిల్లాలో ఆమెను పక్కనబెట్టి మరీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశం ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై మంత్రి సురేఖ ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఇద్దరు మంత్రులు కొండా సురేఖ, సీతక్క మధ్య ఇప్పటికే వర్గపోరు నడుస్తున్నదని కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. తాజా ఆగస్టు 15 ఉత్సవాల్లో నూ సీతక్కకు ప్రాధాన్యం ఇచ్చి, సురేఖను పక్క జిల్లాలో పాల్గొనేలా చేయడంతో ఇది మరింత ఎక్కువయ్యే అకాశం కనిపిస్తున్నది.



**జిల్లాల వారీగా ఆగస్టు 15 ఉత్సవాల ముఖ్య అతిథులు(డిగ్నిటరీ)**

- వరంగల్ : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హనుమకొండ : దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ములుగు : పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- మహబూబాబాద్ : ప్రభుత్వ విప్ జె.రామచంద్రునాయక్
- జనగామ : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- జయశంకర్ భూపాలపల్లి : రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ పొదెం

# గుడుంబా రహిత జిల్లాగా మార్చాలి

- నిందితులపై కఠినంగా వ్యవహరించాలి
- ఎక్సైజ్ ఎఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమీక్ష




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ కమలాసన్‌రెడ్డి

సుబేదారి, ఆగస్టు 13 : ఉమ్మడి వరంగల్ జిల్లాను ఈ నెల 31వరకు గుడుంబా రహిత జిల్లాగా మార్చాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నాటుసారా నిర్మూలను ఉమ్మడి వరంగల్ జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా గుడుంబా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31 వరకు రాష్ట్రంలో ఎక్కడా నాటు సారా కనిపించకూడదని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రతి జిల్లాలో కూడా గుడుంబాను పూర్తి స్థాయిలో నియంత్రించడానికి నెల రోజుల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుడుంబా తయారీకి ఉపయోగించే ముడి సరుకైన బెల్లంపై నిఘా పెట్టాలని, బెల్లం సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుడుంబా కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ ఎన్‌డీపీఎస్ కేసుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎప్పటికప్పుడు డిప్యూటీ కమిషనర్లు, జిల్లా స్థాయి అధికారులు సిబ్బందితో సమీక్ష నిర్వహించాలని సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా మాట్లాడుతూ గుడుంబా, గంజాయి నియంత్రణకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో డ్రగ్స్, నాటుసారా నియంత్రణకు ఎక్సైజ్ అధికారులతో సమన్వయంతో పనిచేస్తామని చెప్పారు.

**గత ప్రభుత్వం గుడుంబా తయారీ దారులను ఆదుకుంది**

గంజాయి నియంత్రణకు ఎక్సైజ్ శాఖ అధికారులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు సమన్వయంతో పనిచేయాలని ఎక్సైజ్‌శాఖ ఈడీ కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం నాటు సారా తయారీదారులను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఉపాధి కల్పించడానికి ప్యాకేజీ ఇచ్చిందన్నారు. మళ్లీ ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ జిల్లాలో అక్కడక్కడా నాటుసారా తయారీ చేస్తున్నారన్నారు. దీన్ని సహించేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని ఈడీ హెచ్చరించారు. గంజాయిపై ప్రత్యేక దృష్టి పెట్టి రవాణా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని సీపీ అంబర్ కిశోర్‌ఝా తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, వరంగల్ రేంజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు, ఐదు జిల్లాల సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు ఎస్సైలు పాల్గొన్నారు.

# నిందితుడిని వెంటనే ఉరితీయాలి

- ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్
- వైద్య విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ



నిరసనలో పాల్గొన్న ఐఎంఏ ప్రతినిధులు




ఎంజీఎం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు, వైద్యులు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 13: కోల్‌కతా ఆర్‌జీకర్ హాస్పిటల్ అండ్ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థిపై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితుడిని వెంటనే ఉరితీయాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్, ఐఎంఏ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేఎంసీ జూనియర్ డాక్టర్స్‌పాటు వైద్యులు సోమవారం రాత్రి ఐఎంఏ భవన్ నుంచి కేఎంసీ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్ మాట్లాడుతూ ఈ ఘటనను యావత్ భారతదేశం ఖండిస్తుందన్నారు. బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కాగా, వైద్య విద్యార్థి హత్యకు నిరసనగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం అత్యవసర సేవలు మినహా విధులకు దూరంగా ఉండనున్నట్లు వైద్యులు ప్రకటించారు. అలాగే, ఎంజీఎంహెచ్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపనున్నట్లు పేర్కొన్నారు.

# అధికారుల తప్పిదం.. అందని రుణమాఫీ

- ఆధార్ నంబర్లు తప్పుగా నమోదు చేయడమే కారణం
- సొసైటీ ఎదుట రైతుల నిరసన



ఊకల్ సొసైటీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గీసుగొండ, ఆగస్టు 13 : వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఊకల్ రైతు సహకార సంఘంలో రుణం తీసుకున్న రైతులకు అధికారుల తప్పిదంతో రుణాలు మాఫీ కాలేదు. ఈ మేరకు మంగళవారం సొసైటీ కార్యాలయ ఆవరణలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఊకల్ సొసైటీ పరిధిలో 13 గ్రామాల చెందిన సుమారు 3వేల మంది సభ్యత్వం కలిగి రుణాలు తీసుకున్నారు. ఇందులో అధికారుల నిర్వాకంతో 184 మందికి రుణమాఫీ వర్తించలేదు. రుణమాఫీ తమకు ఎందుకు రాలేదని రైతులు గీసుగొండ వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి వాకబు చేయగా ఆధార్ నంబర్ తప్పుగా చూపిస్తుందని చెప్పారు. దీంతో రైతులు సొసైటీ ఎండీ రామకృష్ణ, సీఈవో రమేశ్‌ను ప్రశ్నించడంతో మీ ఆధార్ కార్డు నంబర్లు తప్పుగా నమోదు చేయడంతో రుణమాఫీ కాలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అధికారులపై మండిపడ్డారు. ఈ తప్పిదాలకు బాధ్యులను చేస్తూ సొసైటీ ఎండీ, సీఈవోలను సస్పెండ్ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. తప్పులను సరిచేసి రుణమాఫీ వర్తించేలా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఉద్యమాలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు.

## ప్రకృతి ఒడిలో పోలీస్ ఠాణా



చుట్టూ పచ్చని పంట పొలాల నడుమ ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న ఈ పోలీస్ ఠాణా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సర్కారు సకల హంగులతో ఈ పోలీస్‌స్టేషన్‌ను నిర్మించింది. ఆ దారిన వెళ్లే ప్రజలతో పాటు స్టేషన్‌కి వచ్చే వారు ప్రకృతి ఒడిలో ఉన్న ఈ స్టేషన్‌ను చూసి మురిసిపోతున్నారు. పక్కనే ఉన్న మైదానంలో యువకులు, పోలీస్ సిబ్బంది సాయంత్రం వేళ ఆటలు ఆడుతూ స్వచ్ఛమైన చల్లని గాలిని ఆస్వాదిస్తూ సరికొత్త అనుభూతి పొందుతున్నారు.

- టేకుమట్ల, ఆగస్టు 13

# ‘బిట్టు’ సేవలు అమోఘం

**పోలీసు జాగిలానికి సీపీ ఘన సత్కారం**



రిటైర్మెంట్ సందర్భంగా జాగిలం బిట్టును సన్మానిస్తున్న సీపీ

సుబేదారి,ఆగస్టు 13 : వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయ జాగిలం ‘బిట్టు’ ఉద్యోగ విరమణ పొందింది. మంగళవారం హనుమకొండలోని తన కార్యాలయంలో పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా జాగిలానికి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ 2013 డిసెంబర్ 26న జాగిలాల విభాగంలో బిట్టు పేరుతో చేరిన స్నిఫర్ డాగ్ 11 ఏళ్లు సేవలందించిందన్నారు. ముఖ్యమంత్రులతో పాటు వీఐపీలు కమిషనరేట్ పరిధిలో పర్యటించినపుడు బిట్టు పేలుడు పదార్థాలను గుర్తించడంలో కీలకంగా వ్యహరించిందని సీపీ కొనియాడారు. నేరస్తులను పట్టుకోవడంలో ఎంతో ప్రతిభ కనబరిచిందన్నారు. కాగా, బిట్టుకు హ్యాంగ్లర్‌గా కానిస్టేబుల్ ప్రభాకర్ వ్యవహరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఓరుగల్లులో భారీ మట్టి గణపతి

**ఖైరతాబాద్ తరహాలో నగరంలో తొలిసారి..**



నిర్మాణంలో ఉన్న 40 అడుగుల మట్టి వినాయక విగ్రహం

పోచమ్మమైదాన్, ఆగస్టు 13: ఖైరతాబాద్ వినాయకుడి తరహాలో ఓరుగల్లులో తొలిసారిగా భారీ మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. వరంగల్ తూర్పులో పర్యావరణాన్ని కాపాడడానికి పూర్తిగా మట్టితో 40 అడుగుల వినాయక విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. ఇందుకోసం ఒడిశా శిల్పి జయదేవ్‌తోపాటు 10 మంది శిల్పులతో నెల రోజుల పాటు శ్రమించనున్నారు. దాదాపు రూ. 20 లక్షల వ్యయంతో విగ్రహం రూపుదిద్దుకోబోతుందని, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు భద్ర కాళీ హిందూ ఉత్సవ కమిటీ వ్యవస్థాపకుడు సంజు తెలిపారు. వినాయక చవితి పండుగ నుంచి 9 రోజులపాటు పూజల అనంతరం గణపతిని ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో భద్రకాళీ ఆలయ చైర్మన్ శేషు, డాక్టర్ కాళేశ్వరం సుమన్ శర్మ, మడిపల్లి కృష్ణ, పిట్ట నర్సింగరావు, అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు.




కాకతీయ యూనివర్సిటీ లా కాలేజీ

# కేయూ లా కాలేజీలో అడ్మిషన్లు నిలిపివేత

**బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకి డిపాజిట్ కట్టని ఫలితం**

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 13: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని లా కాలేజీలో అడ్మిషన్లు నిలిపివేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కాషన్ మనీ అండ్ సెక్యూరిటీ డిపాజిట్ కింద కట్టాల్సిన ఫీజు కట్టని కారణంగా ప్రవేశాలు నిలిపివేసినట్లు తెలుస్తోంది. యూనివర్సిటీ కాలేజీలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. యేటా ప్రతి లా కాలేజీ ఆయా కోర్సుల ఇన్ఫ్రాస్ట్రక్చర్, సెక్యూరిటీస్ ఫండ్ పేరు మీద కొంత మొత్తం కట్టాల్సి ఉంటుంది. కాకతీయ యూనివర్సిటీ కూడా రూ.10 లక్షలు కట్టాల్సి ఉండగా, గడువు తేదీలోపల కట్టకపోవడంతో అడ్మిషన్లు నిలిపివేశారు. డబ్బులు కట్టగానే పునరుద్ధరిస్తారు. ఇది కేవలం అడ్మినిస్ట్రేషన్ అధికారుల నిర్లక్ష్యమేనని ప్రొఫెసర్లు, ఉద్యోగులు, అధ్యాప కులు, విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. రూ.10 లక్షలు కట్టడానికి వీసీ అనుమతి లభించినట్లు తెలుస్తోంది. గతంలో కూడా రూ.5 కోట్ల ఐటీ కట్టకపోవడంతో హైదరాబాద్ ఐటీ కమిషనర్ కేయూ అకౌంట్లను సీజ్ చేశారు. మళ్లీ డబ్బులు కట్టడంతో పునరుద్ధరించారు.

# జనగామ హాస్టల్‌లో ఏసీబీ తనిఖీలు

- భోజనం నాణ్యత, ఇతర సౌకర్యాలపై ఆరా
- పలు సమస్యలను గుర్తించిన అధికారులు
- ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఎస్పీ సాంబయ్య వెల్లడి



బాలికల వసతి గృహంలో తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారి

జనగామ, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లాకేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతోపాటు విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత, వసతిగృహంలో మరుగుదొడ్లు, వంట, పడక గదులను క్షుణ్ణంగా పరిశీలించి పలు సమస్యలను గుర్తించారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను రికార్డు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఏసీబీ డీఎస్పీ సాంబయ్యా తెలిపారు. ప్రధానంగా విద్యార్థుల హాజరు పట్టికలో అవకతవకలను గుర్తించారు. రికార్డుల ప్రకారం 110మంది విద్యార్థులు ఉండగా సోమవారం రాత్రి 73 మంది హాజరైనట్లు చూపించినా వాస్తవానికి కేవలం 60మందే హాజరైనట్లు తమ పరిశీలనలో వెల్లడైందని ఆయన తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మంగళవారం అరటి పండు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదనే విషయం విద్యార్థులను ఆరా తీస్తే తేలిందన్నారు.